# అరిజనాస్సిరమం

అది అరిజనాస్సిరమం. అయిదో తరగతి దాకా సదువుకొనేందుకు, కాయితాలు సేత్తో సెయడం, నవారు నెయడం, ఏకుల్తో రాటమ్మీద నూలు తియటం, తాటాకు రంగు బుట్టలు సెయడం ఆ ఆస్సిరంలో వుంది. సేతి పన్లు సేసి అమ్మడం, అయిదో కళాసుదాకా సదివి పై సదువులకు పోడం, ఆడ ఓ డెబ్బయి సిల్లర మొగపిల్ల ఆడపిల్లకాయలుంటారు, ఆ యిస్కోల్లో. ఆళ్లందరికీ ఆడే వుంటానికి పాకలూ తింటానికి తిండీ వుంటయ్.

ఆ అరిజనాస్సిరం నడిపేది రంగనాయకులు, ఏభై అయిదేళ్లుంటయ్ – కుడికాలు కుంటిది. రెండో ఏటనే జబ్బులో కాలు పోయింది. పెల్లాం, యిద్దరు కొడుకులు, యిద్దరు ఆడపిల్లల కుటుంబం ఆయన్ది.

ఆ ఆస్సిరం అరిజన సంగాల కోసం, పై కమిటీల వల్ల నడుసుద్ది. గాందివోరన్నా, ఆయన వుద్దెమాలన్నా గనంగా సెప్పుద్దా ఆస్సిరం. ఆస్సిరమాలు నడపాల్సిన యిదానం అసలు గాందీవోరే సెప్పారు ఎట్టుండాలో.

ఎంకడికి యాభై ఏళ్లుంటయ్. ఆస్సిరం పనివోడు. కాపలా, సిల్లర పన్లు సేత్తాడు ఆస్సిరమానికి. పెల్లాం, యిద్దరు కూతుళ్లుండారు, ఎంకడికి. పరాయి వూళ్లో వుండే సెల్లెలు కొడుకు కోటిగాడు యిక్కడ ఆస్సిరంలో నాలుగో కళాసుదాకా సదివి వొదిలేసిన వారు నెయడంలోకి దిగాడు, నాలుగు డబ్బులు రావచ్చుని.

'ఎంకయ మావాఁ, నాకీ ఆస్సిరం సెడ్డ పితలాటకంగా వుండదిలే!" అన్నాడు, సందేల సీకటి పడ్తంటే ఆస్సిరం ఓ మూల మఱ్ఱిసెట్టు కింద కూకుండి ఎంకడు మావఁతో మేనల్లుడు కోటిగాడు.

"నీ యవార మేంటో చూటిగా నాకు తెలవాలగా ఏదన్నా అనుకోటానికి?"

"మూడో కళాసు ఎట్ట దాటానో మొదలు నాకు తెల్చింది కాదు; యిగ నాలుగో కళాసులో కొచ్చేతలికి నా బుఱ్ఱ సాంతం సెడిందనుకో. యిగ సదువు నావల్ల పెగల్దని నవారు నెయటం నేర్చుకోవటానికి కళాసులో సేరా" అన్నాడు కోటిగాడు.

"పరవాలేదులే కోటిగా. నవారు నెయటం ఒక దార్న పడిందంటే దాన్ని అమ్మితే డబ్బులు బాగా యిత్తార్లే యీ ఆస్సిరం మదుసులు" అన్నాడు ఎంకడు మావ.

"అదంతా వృత్తి బూటకంలే ఎంకడుమావా! నవారు నేత బాగా నేర్చుకుండ బూసాయికి మూడు రూపాయలిత్తారంట రోజుకు. అందులో ఒక రూపాయి యీ ఆస్సిరం సందాకు అని మేనేజిర్లు తీసుకుంటారంటగా బూసాయన్నాడూ?" అన్నాడు కోటిగాడు.

"యీ ఆసిరంలో వుంటానికీ, బువ్వ రెండు పూట్ల తింటానికి, సదువుగాని, సేతిపన్లుగాని నేర్సుకుండానికి వూరకనే జరుగుతా వుండదిగా. మరి సేతిపన్ల మీద డబ్బులు గిట్టుబాటవుతే అంతా నువు తింటే ఎట్టా?" అన్నాడు ఎంకడు మావఁ.

"నిజమే ననుకో. మరి మూడు రూపాయల కూలి సానా తక్కువేనే. యీడ ఏదో సాన్నాళ్లు నేర్సుకుంటే సివరకి మనకు ఎట్ట గిట్టుబాటవుద్దబ్బా? వూల్లో కూలి చేసుకుంటావుంటే యింతకన్న ఎక్కువ గిట్టుద్దే మరి?" అన్నాడు కోటిగాడు.

"నిజమేగాని బయట మాల మాదిగల కూలీల కన్న యీడసాన మెరుగ్గాదూ? యీడ సదువుకుని బయటకెల్లి యింకా పెద్ద సదువులు సదివి పెద్ద వుద్దోగాలు సెయ్యొచ్చుగా? సేతిపన్లు యీడ నేర్సుకొని బటయ తంటాలు పడ్తే కాత్తె బతుకు మెరుగు తేల్తుండదిగా? రామానంద సామీజీ యియాల రంగనాయకులు కాడకొచ్చాడు, ఆయన ఎంత గొప్పోడో నీకు తెల్సా? యిసువంటి ఆసిరమాలకు ఎంతో గొప్ప గొప్ప పన్లు సెత్తావుంటాడో అందరికీ తెల్సు! బువ తినడు. ఏదో సిన్న పలారం సేత్తాడంట. పెద్ద సదువు పెద్ద సేతిపన్లు ఎన్నో వచ్చుంట ఆయనకు. ఒక్క దంబిడి రొక్కం తీసుకోడు ఏడ, ఆసిరమంలో పన్జేసినా. ఎప్పుడన్నా నువు యిన్నావా ఆయన్ని గురించి?" అన్నాడు ఎంకడు మావ.

యీ మద్దె రామానంద సామిజీని ఒక పాలి సుశాలే. అట్టాటోరు యీడ గొప్పోరవుతారో తెలవడం సానా కష్టం" అన్నాడు కోటి. ప్లీడరీ చేత్తా వొదిలేశాడంట. ఒక పెల్లాం ఆరుగురు పిల్లకాయల్ని వొదిలేసి యిసుమంటి ఆసిరమాల ఎంట తిరుగుతూ, గాందీ, వోరి మాట సెబతా తిరుగుతూ వుంటాడంట" అన్నాడు ఎంకడు మావ.

"మరి యిసువంటి ఆశ్రిమాల్లో నాలాంటి పిల్లకాయల్ని యీయనో దారిన పెడ్తాడంటావా?"

* * *

మరసటినాడు తెల్లారి కనుసీకటి ఏలప్పుడు కోటిగాడికి కొత్తె ఆస్రిమానికి బయట కాలవ దగ్గర కుండతో కంట బడింది ఎంకడి మాఁవ పద్దాలుగేళ్ల పెద్ద కూతురు మంగి.

"ఏం మంగి పిల్లోవ్! ఎట్టుండావ్?" పలకరిచ్చాడు కోటిగాడు, మురుస్తూ.

"యావోఁ, నాకేం తెల్సుద్దీ నీ కల్లకు ఎట్ట కనుపిత్తానో?" అంది మంగి, వోణీ

కొంగు నోట్లో పెట్టుకుని కళ్లతో కోటిగాణ్ణి మురుత్తా చూత్తూ.

"ఎట్ట కనుపిత్తావో సెప్పాలంటే సానా రోజులు పట్టుద్దే మరి - ఎట్ట సెప్పాలబ్బా?" అన్నాడు కోటిగాడు మంగిని అట్టనే చూత్తూ.

"నువు పెద్ద కిలాడివి, నిన్ను తేలిగ్గా నేను నమ్మకేవి, యింకెవురన్నా ఆడపిల్లలు బాగా అగుపిత్తారా నీ కల్లకు?" అంది మంగి.

"యీ జనమలో ఎరగను యింకో ఆడపిల్లని గురించి! నన్ను అట్ట దూరంగా సూత్తా పోతావేగాని, నువు నాతో కాత్తెమాట చరీగా మాట్టాడవేం ఎప్పుడూ? రంగు బుట్టలు బాగా అల్లుతున్నావంటగా?" అన్నాడు కోటిగాడు.

"నేను బాగా అల్లటం నువు చూశావా?" అడిగింది మంగి.

"కాత్తె దూరంగా సూశా. నువు ఏది ఎట్ట అల్లినా నాకు బాగుంటది!" అన్నాడు కోటిగాడు.

"రంగనాయకులే సానా బాగుందన్నారు నేనల్లడం' అంది మంగి.

"ఎవరు - మన ఆశ్రిమం పెసిడెంటా?" అడిగాడు కోటిగాడు.

"అవునుమరి. రామానంద సామీజీ కూడా నేనల్లడం సానా బాగుందదన్నాడు" అంది మంగి. ఆ సామీజీ యింకే పిల్లల అల్లకం బాగుంటదని అంటం నాతో ఎవురూ అన్లేదే?" అన్నాడు కోటిగాడు.

"సాల్లే. నీకేం దెల్చు బుట్ట లల్లకం. యింకో యాభై సార్లు సూసినా నీకు తెలవదు - ఎల్లు, ఎల్లు" అంటూ కాళ్లు ఆడిచ్చుకుంటూ ఎల్లింది మంగి.

* * *

కోటిగాడు ఆసిరమం కాడి కొచ్చే తలికి మగపిల్ల కాయలు కుస్తీలు నేర్చుకునేవోరు. ఆసనాలు ఏసేవోరు, లగెత్తేవోరు, తానాలు సేసేవోరు. రకరకాల పన్లతో కనిపించారు.

"సామీజీ అగుపించాడా - యీడ కొచ్చాడంటగా రామానంద సామీజీ వోరు?" అడిగాడు కోటిగాడు ఒక తెలిసిన పిల్లగాడ్తో.

"నిన్ననే సూశాగా! సానా గొప్పోడు" అన్నాడు ఆ పిల్లకాయ.

"సామీజీ నువు సేసే పని చూసి నిన్ను చూసి గొప్పోడన్నాడా?" అడిగాడు కోటిగాడు.

"లేదు కోటిగా. అట్టాటి మాటలు నేనెప్పుడూ యిన్లా. ఎన్ని రోజులు మూడో కళాసు సానా బాగా సదువుతున్నా ఎవురేం అంటంలా" అన్నాడు ఆ పిల్లగాడు.

"ఏం సదువు బాగా వొత్తుండదే నాకూ. రంగనాయకులుగారు బాగా సదువుతుండావన్నారు నన్ను" అన్నాడు రెండో పిల్లకాయ.

"రంగనాయకులు గారింట ఎప్పుడూ తిరుగాడ్తూ వుంటావు, ఆయనకు యింటో అన్నీ సేసిపెడ్తూ – మరి నీ యవారం బాగుండదని ఎందుకు అంటాడా రంగనాయకులు." అన్నాడు మొదటి పిల్లకాయ రెండో పిల్లగాడ్ని.

"నేను సదవడం బాగుంటది గనకనే నన్ను దెగ్గిరికి రామంటాడు పెసిడెంటుగోరు" అన్నాడు రెండో పిల్లకాయ.

"మన ఆస్సిరమానికి సరఫరా అయ్యే కిరసనాయిలు నీతో బయిటికి పంపి అమ్మియటంలా రంగనాయకులు? మా గదుల్లో కిరసనాయిలు తక్కువ అయి దీపాలు అసలెలగ వెందుకు?" అన్నాడు మొదటి పిల్లకాయ.

"మన రంగనాయకులు గోరికి అన్నీ తెల్చు. ఆసిరమాన్ని ఎట్టా నడపాలో. మనలకి తిండి బెట్టి సదువు చెప్పిచ్చి సేతిపన్లు నేర్పుతా ఆసిరమం బాగా నడపాలంటే డబ్బు కాడ అంత తేలిగ్గా జరగదు" అన్నాడు రెండోవాడు.

"ఆసిరమానికొచ్చిన పది బియ్యబ్బత్తాలు కూడా అమ్మిచ్చాడు రంగనాయకులు గోరు. అవి మన ఆసిరిమానికి దానం సేసినవి కావూ?" అన్నాడు మొదటి వాడు.

"సానా బత్తాలు దానం చేత్తారు. అందులో ఎక్కువగా వుండ బత్తాలు బయట అమ్మితే ఆసిరమానికి యితర కరుజులకు పనికొత్తావుంటయ్యంట– రంగనాయకుల గారు సెప్పాడు" అన్నాడు రెండో పిల్లకాయ.

"మరి వొణ్ణం సరిగా సరిపోదని నాతోబాటు సానామంది అనుకుంటారే, మరి రంగనాయకులకు తెల్చే బియ్యం బయట అమ్ముతాడు. అదెట్టుంటదీ?" అన్నాడు మొదటి పిల్లకాయ.

"గుడిసెల కరుజు, సదువుల కరుజు, సేతిపన్ల కరుజులకు ఎంతవుతే మనకు జరుగుబాటవుద్దంటా? మొదుట యీడ సదువులు సేతిపన్లు బాగా నడుత్తావుంటం నీకు గిట్టక నీ బుద్దెప్పుడూ గెడ్డి తింటావుంటదిలే. ఎల్లుఎల్లు. మాలమాదిగల బతుకులే నీకు ఎక్కువగా వుంటదెప్పుడూ" అంటా రెండో పిల్లకాయ ఎల్లిపోయాడు ఆదుంటం గిట్టక.

"యీడు గొప్పోడు. మన మాలమాదిగలంటే యీడికి గిట్టదు" అన్నాడు మొదటి పిల్లకాయ, రెండో పిల్లకాయ ఏపు వుమ్మ్మూస్తా.

"మన మాలమాదిగల యదవ బతుకు బాగుపట్టం కాదన్లేకనేగా యీ ఆసిరమానికొచ్చిందీ? దీనికి సందా పేరటనే పోగయ్యే సరుకు ఆవజానమ్మటానికి

రంగనాయకులు లచ్చరకాల సమాదానాలు సెబతావుంటాడు. ఆయన జరుగుబాటయే గొప్పోడేగా మరీ?" అన్నాడు కోటిగాడు యవారం అంతగా అంతుబట్టక.

* * *

కాత్తె సీకటి పడ్డాక ఆసిరమం మూలవుండ మఱ్ఱిసెట్టు కెనకమల కాలవకాడ గట్టుమీన ఒక తుప్పకు అసంటగా సుట్ట కాలుత్తా కూకుండ అయిదో కళాసు నరచింగం మాస్టరు గోరు అగుపించాడు అటొచ్చిన కోటిగాడికి.

"నర్చింగం మాస్టోరు సుట్టకాలుత్తా యీడ సాటుగా కూకుండారల్లే వుండదే?" కోటిగాడన్నాడు మాస్టోరితో మాటాడాల్సిన పద్ధతిలో.

"అందర ముందర తాగటం మర్యాద కాదని యిటొచ్చాలే" అన్నాడు మాస్టోరు.

"అవున్లెండి. నాకూ తాగటం బాగుంటది గానీ – యీడ సెయటం బాగుండదని మానేశాలే. మీకు మటుకు వుండదా మన ఆసిరమం సానా గొప్పజాతిదని?" అన్నాడు కోటిగాడు ఒక్కో మాస్టారి యవారం యింటం అదోరకంగా వుంటదనుకుంటూ.

"చచ్చింది యీ హరిజనాశ్రమం! అంతా కుట్ర!" అన్నాడు మాస్టోరు సుట్ట కాలుత్తా.

"మా మాలమదిగోళ్లకు బాగా పనికొచ్చుద్దని నా అసుమంటి వోళ్లం సానా మందిమి అనుకుంటామే" అన్నాడు కోటిగాడు.

"యీ సొంతం చెడ్డ మాలమాదిగలు అనుకుంటానికి యింకేం వుంటుంది? నాకు నెలకు 250/- యిస్తానని ఓ నెల రెండొందలూ యింకో నెల నూటడెబ్బయ్యయిదూ యిస్తా వుంటాడు రంగనాయకులు. నోర్తెడుగుతే యిప్పటికి పదిమంది మాస్టర్లయినారు. ఆశ్రమానికి చందాలు సక్రమంగా అందటం లేదంటాడు. ఏం జేస్తాం? అన్నాడు మాస్టోరు.

"రామానంద సామీజీ అంత గొప్పోడు, మన రంగనాయికులంత గొప్పోడు లేడంటాడు. యింకెవురి మాట ఎవురికి లెక్కవుంటదీ?" అన్నాడు కోటిగాడు.

"రామానంద సాధూజీ అంత మహానుభావుణ్ణి మామూలు మనుషులు అర్థం చేసుకోడమంటే వారు పది జనమలెత్తి యింకో పది సాధూజీల అంతస్తులు దాటేగాని ఆయన మనకి అంతుబట్టడు. నిన్న పొద్దున పదిన్నరకు సాధూజీకి రంగనాయకులు పలహారం పెట్టిస్తుంటే నేననే చిన్న సామాన్యుణ్ణి అక్కడ వుంటం జరిగి చూట్టమైంది" అన్నాడు మాస్టోరు.

"ఫలహారమంటే సానా తక్కువ రకంగా దవ పదార్థాలు తింటారు" అన్నాడు కోటిగాడు.

"మన తెలివితేటలంటే ఏరకంగా వుంటయ్యని నువ్వనుకుంటా అరడజను పెద్ద మామిడిపళ్లు, యీసెడు ద్రాక్షపళ్లు, అరడజను ఏపిలుపళ్లు అక్కడ పళ్లెంలో వున్నయ్.

"అబ్బో! మంచి పలారం అల్లే వుండదే!"

"మూరెడు నాలుగు చెరుగ్గడలు, మూడు పెద్ద బొప్పాయి పళ్లు, సోలెడు పాలు వుంటయ్యాడ".

"అబ్బో! పెద్ద యవారమే!"

"అరసోలెడు పుట్టతేనె ఓ వెండిగిన్నెలో వున్నదక్కడ" అన్నాడు మాస్టోరు మనసు పలారం మీద పడి కొట్టుకులాడ్తుంటే.

"అది పలారం కడుపు ఎందుకవుద్దీ? పప్పుసుద్ద, పులుచు, కూరలు, పచ్చళ్లు, గారెలు, బూరెలు, పాయసాన్ని మించిన కడుపే సాధూజీది" అన్నాడు కోటిగాడు యింతబోతూ.

"దజన్లు దజన్లు మానికలపై మానికలు పళ్లు, పాలు, తేనె లాంటివి వుంటే అవి ఎన్ని తిన్నా పప్పు పాయసం అల్లే తిండికాక చిన్న పలహారమే అవుతుందిగా" అన్నాడు మాస్టోరు చుట్ట పీలుస్తూ.

"రామానంద సాధూజీ రంగనాయకులు గోరికి సానా గొప్పోడు"

"అందుకే సాధూజీగారు మన ఆశ్రమంలో వుండిపోతాట్ట, రంగనాయకులు గారు సాధూజీ ఆలోచన చాల గొప్పదన్నాడు" అన్నాడు మాస్టోరు.

* * *

మరసనాడు అరిజన వార్సి కోచ్చవాలు ఆ అస్సిరమంలో. పందిల్లు పూర్తి జేస్తున్నారు, నాటకం రిఆర్సలు సివరిసారి చూస్తుండారు ఆడమగ పిల్లకాయలు పాటలు సూసు కుంటుండారు. అరిజన 'గాంది పటాలం' గుడ్డలన్నీ ఒకే మాదిరి గుంటానికి చూసుకుంటున్నారు.

రామానంద సామీజీ ఆడీడ జరుగుతున్న వుత్సవాల ఏర్పాట్లు పైపైన జూసి తన ఆస్రిమం గదిలోకి ఎల్టం జూసిన ఒకరిద్దరు ఆస్రిమం పిల్లకాయలు, రామానంద సామీజీ గది తలుపు గడియ బిగియటం సూసి కొందరు పిల్లకాయలు, ఆరీర్తో మాట్టాడి సరీగా సాధూజీ గది కాడ చేర్తుంటే కోటిగాడు తయారయ్యాడు ఆడ.

"సామీజీ ఓ ఆడిపిల్లను గదిలోకి చేర్చాడు. ఎవరో అరుత్తుండారు గదిలో అన్నాడు ఓ పిల్లగాడు.

"గదిలో రంగు బుట్టలుంటయ్యని లోనకు పంపించి ఎనక నుంచి తాను ఎల్లి

తలుపేశాడు సామీజీ" అన్నాడు ఇంకో పిల్లగాడు.

'లోన అరుత్తుండదాపిల్ల - ఎందుకో - తలుపేశాడు సామీజీ - ఎందుకో" అన్నాడు మరో పిల్లగాడు.

"ఆ పిల్ల మంగి. నే సూశా. అరుత్తుండది లోనుంచి" అన్నాడింకో పిల్లగాడు.

"మంగా? అరుత్తుండదా? తలుపు, తలుపు తియ్యవయ్యా! మంగి అరుత్తుండది లోన. తలుపు, తలుపు" అనరుత్తా కోటిగాడు తడికె తలుపు మీన బలంగా నాలుగు తన్నులు తన్ని తలుపును యిరగ్గొట్టి గదిలోకి లగెత్తాడు మిగతా పిల్లకాయల్తో.

ఓ నులకమంచం ఎనకమాల చీర సద్దుకుంటూ అరుత్తావుండ మంగి సామీజీని తప్పించుకొని కోటిగాడి దగ్గరకు చేర్తుంటే సామీజీ "ఏమిటి మీ అల్లరి? తలుపు విరిచారేమిటి? లోపల ధ్యానం చేసుకుంటానికి వొస్తే, ఎవరీపిల్ల లోపలుంది? ఏమిటి మీ గందరగోళం? పోలీసులకి పట్టిస్తా మీ అఘాయిత్యానికి - పోండి అవతలకి చప్పున!" అనరిచాడు మంచం యివతల నుంచున్న సామీజీ.

"యీయనగోరు మంచి రంగు బుట్టలు లోనున్నాయి రమ్మనమని గబాల్న తలుపేసి నన్ను ఆ నులక మంచమ్మీనకు లాగుతుండాడు" అనరచింది మంగి జుట్టుముడి సవరించుకుంటూ.

"ఏమిటి భగవాన్ యీ అయోమయ అమాయిక అలజడి? యీపిల్ల నాగదిలోకి చొరబడిందెందుకు భగవాన్? పూజారాధన ప్రారంభించబోతే యీ పరీక్ష ఏమిటి భగవాన్? నాయన్లారా! మీరు వెళ్లండి. అమాయకులు - అనవసరంగా ఆ పిల్ల యిక్కడ అఘాయిత్యానికి చేరి దాక్కుంటే మీకు తెలియక అమాయకంగా అరుస్తున్నారు. వెళ్లిరండి చప్పున! వూఁ!" అన్నాడు సామీజీ, అక్కడి పిల్లకాయల్ని అదిలిస్తూ.

"సామీజీ నీ మీద పడబోయినాడా మంగీ." అన్నాడు కోటిగాడు.

"ఆ మంచం మీనకు తోసి నా చీర లాగుతుండాడు సచ్చినోడు. మంచి బుట్టలిత్తానంటే రేపు సబలకు మంచివి సేరుద్దామని యీడకొచ్చా. యీ సాదువు యవారం తెలవక. నన్ను లాగుతుండగా పెద్దగా అరుత్తే మీరొచ్చారు బగమంతుడి దర్మాన" అంది మంగి బెదుర్తూ.

మెరిసినట్టు కోటిగాడు ఎడం కుడి సేతులు, కాళ్లు లెగిసి సామీజీ వీపు, డొక్కలు, ఒల్లు, కాల్లు పటపట పొడుసుకోటం, సామీజీ నేల మీద పడి, "మాధర్చేత్! ఫుండాకోర్! నీ ప్రాణం తీయిస్తా!" అని అరుస్తుంటే, రంగనాయికులు అక్కడికి గబగబ వచ్చి "ఆపండి" అల్లరి "అనరిచాడు. అందర్నీ చూస్తుంటే కోటిగాడు, మంగి, పిల్లకాయలు ఎటు ఎటుగానో అందరూ లగెత్తారు ఎంటనే.

ఓ అరగంట గడిసినాక రంగనాయకులు కోటిగాణ్ణి యింకో పదిమంది పిల్లకాయల్ని పిలిపించాడు.

"సామీజీ మీద పడి కొట్టావంట! నిజమేనా?" అడిగాడు రంగనాయకులు.

"మంగిని తనగది తలుపేసి సెరచపొయ్యాడు రామానందం" అన్నాడు కోటిగాడు.

"నోరుముయ్! సామీజీ విషయం నాకు తెలుసు. వెంటనే ఆశ్రమం విడిచి వెళ్లిపో. యింకెవ్రా కోటిగాడ్తో చేరింది?" మిగతా పిల్లల్ని చూస్తూ కోపంగా అడిగాడు రంగనాయకులు.

"కోటిగాడు ఏం జేసిందీ మీకసలు తెలవదు" అన్నారు పిల్లకాయలు.

"ఆ పిల్లకాయలకు సామీజీని కాత్తె గొప్పోణ్ణిగా సూట్టం దప్ప యింకేం తెలవదు. ఆ సామీజీ గొప్ప కాత్తె దగ్గర్నించీ సూసింది నేను. మంగిని ఒంటరిగా పట్టుకుని దాని సీరలాగు తుంటే తడిక తలుపు యిరిసి, యవారం సూసి, సామీజీ గొప్పను సొంతం తెలుసుకొని రెండు జాడించి మంగిని యిడిపించుకు రావాల్సొచ్చింది" అన్నాడు కోటిగాడు.

"నోర్ముయ్! నువు పచ్చి రౌడీవి. ఆశ్రమం నుంచి వెళ్లిపో. నిన్ను మళ్లీ రేపు చూశానంటే పోలీసులకు పట్టిస్తా. ఫో యిక్కడ్నించి"! అన్నాడు రంగనాయకులు.

ఆరాతిరే తన గుడ్డలు సిన్న టంకుపెట్టెలో పెట్టుకుని అక్కడ్నించి యింకోమారు బయటకెల్లిన కోటిగాడు వూరిబయట పెద్ద నేరేడు సెట్టుకింద మనిషి నుంచుంటం సీకట్లో సూశాడు.

"ఎవరు?! మంగీ?!" అడిగాడు ఆచ్చర్యంగా కోటిగాడు.

"అవును! నేనే! యాడికో ఎల్తుండావే - టంకుపెట్టె తీసుకుని?" అడిగింది మంగి.

"యాడికెల్తే ఏంలే! యాడ నుంచుండా వెందుకు?"

"నాకు తెల్సులే, రంగనాయకులు నీ మీన యిరుసుకు పడ్డాడని. ఆడపిల్లల మీన పడ్డం ఆళ్లకు తెల్లారి లేత్తే యిదే జాతర. అయితే ఎవురూ ఆయన్ని ఏమీ అనరు. రత్తమ్మ, సూరమ్మ, లచ్చికి యిదే పని. రంగనాయకులు ఎప్పుడు రామంటే ఆడకెల్తారు. బజారు నంజలు. రంగనాయకులు తెగ డబ్బు జేసుకుంటాడు ఈ ఎదవపన్ల మీన - కిరసనాయిలు, బియ్యం, నవారు యిట్టాటివన్నీ అమ్ముకుని తినడం, పెట్టెలో ఏసుకోటం నాకు బాగా తెలుసు. మా అయ్య ఎంకడు సెప్పాడు. పైగా ఆసిరమానికి సందాలు సాలవని, అరిజనోద్ధరణకు డబ్బు సాల్దం లేదంటాడు రంగనాయకులు. మా అయ్యకు యివన్నీ తెల్సు" అంది మంగి.

"నీకు అన్నీ తెలిచేనా ఆసామీజీ పిలుత్తే ఎల్లావు?"

"రంగు బుట్టలు మంచివి సూసి తెద్దామనుకొని ఆయన పిలుత్తే ఎల్లగాని సామీజీ కూడ రంగనాయకులకు జంటని నాకు తెలవదు. సిన్నదాన్ని, నన్ను మంచమ్మీన పడీయాలని సూశాడు. నువు సమయానికి రాకపోతే నా సంగతే మయేదో నాకే తెలవదు. నాకసలు మొగోర్ని సూత్తే బహు రోత" అంది మంగి.

"నువు సామీజీ గదిలో కెళ్లింది, నువు మంగివి కాదని తెలుత్తే అటెల్లడం అవసరం వుండేదో కాదో తెలవదు" అన్నాడు కోటిగాడు.

"నాకు తెల్సు! నువు నా అత్త కొడుకువని, నన్ను వొదిలి పెట్టవని, నాపేరంటే నీకు సానా యిట్టమని నాకు సానా తెల్సు" అంది మంగి.

"నా పేరంటే నీకు గిట్టుద్దని నాకు తెలవదులే" అన్నాడు కోటిగాడు.

"మా అయ్యానడుగు, నీకే తెల్సుద్ది. నువు దప్ప నాకెవురూ గిట్టరని అయ్యతో సెప్పా. ఎల్లి అడుగు ఏమంటాడో" అంది మంగి.

"యీడకి యిరవై మైల్ల దూరంలో యింకో గాంది వారి ఆసిరమం వుందది. ఆడకెల్లి అందులో సేర్తా. యీడ వుండడం నాకసలు అసయంగా వుంది. అరిజనులు వుద్దరణ అని వారు పైకి సెప్పటమేగాని డబ్బు కాజేయడానికి మనమంతా పనికొత్తామేగాని నిజంగా మనకు, మనకోసం మంచిపన్లు సేసేందుకు ఆళ్లకు ఆలోశనలు లేవు. సామీజీ ఆసిరమాన్ని ఎంత పాడుసేసే మడిసో రంగనాయకులకి సూదాలని లేదు. నన్ను ఈడ్సించి పంపడం ఆయనకు గిట్టక కాదు. ముందు నేనీడ వుంటం గిట్టక ఎల్లిపోతుండా. యీడ నాకు ఎవురన్నా నచ్చారంటే అది నువొక్కతివే వుండావు" అన్నాడు కోటిగాడు.

"నువంటే నాకెప్పట్నించో యిష్టం కోటిగా! అందుకే, నువు ఎల్తుండావని తెల్సి యీడకొచ్చి నేను రెడీగా వుండా. ఎల్దాం పద, నీతో వత్తా. మా అయ్య సెప్పా, నీతో ఎల్తుండానని – యీడ నేనుంటే నన్ను సెడగొట్టక సరీగా బతకనీయరు. ఎల్దాం పద!" అంది మంగి.

"ఆసిరమం అంటే నువు సాలు మంగీ! యింకో సోటికెల్లి ఆ ఆసిరమం బాగుండాలనుకుందాం. పద మంగీ! ఎక్కడికి పోయినా మనం యిడిసిపోము".